సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 26 । జూలై । 2023



వాటర్‌ట్యాంకుతండా శోకసంద్రం

బీటెక్ విద్యార్థి మృతితో మిర్యాలగూడ మండలంలోని వాటర్‌ట్యాంకుతండా శోకసంద్రమైంది.

- 8లో



ప్రభుత్వ భూములు పదిలమేనా

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములపై అక్రమార్కులు కన్నేశారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 31°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

భువనగిరి: భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం, గురువారం విద్యా సంస్థలకు రాష్ట్ర విద్యాశాఖ సెలవు ప్రకటించినట్లు డీఈఓ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ రజిని, జిల్లా కోఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి గురుకుల కళాశాలలో జువాలజీ, ఇంగ్లిష్, చౌటుప్పల్‌లో ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్ బోధన పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేయడంతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు ఫారాలతో ఈ నెల 27న భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో డెమోకు హాజరుకావాలని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



కప్రాయపల్లిలో వర్మి కంపోస్టు షెడ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎస్‌జీ బృందం సభ్యులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని పుల్లాయిగూడెం, కప్రాయపల్లిలో పారిశుద్ధ్య పనులను స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అమలవుతున్న తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్, పల్లె ప్రకృతి వనం, వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశీలించారు. వీరి వెంట డీపీఎం సునంద, డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ రమేష్ ఉన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆంజనేయస్వామిని అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. శ్రీస్వామి వారికి నిత్య ఆదాయం రూ.9,12,657 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

హోటళ్ల తనిఖీ



హోటల్‌లో వాటర్‌బాటిళ్లు, కూల్‌డ్రింక్స్ పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని పలు హోటళ్లలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతిలు హోటల్స్‌లోని ఆహార పదార్థాలు, వంటకు ఉపయోగించే ముడి సరుకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ హోటళ్లలో పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్స్ నుంచి సేకరించిన ఆహార శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించామని, కల్తీ అని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మున్సిపాలిటీ నీరు శుద్ధి కావడం లేదు

భువనగిరిటౌన్: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున మున్సిపల్ ద్వారా సరఫరా అవుతున్న నీరు పూర్తిగా శుద్ధి కావడం లేదని, వీటిని తాగడానికి మినహాయించాలని మున్సిపల్ కమిషనర్ భట్టు నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగడానికి మినహా ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నిండిన గండిచెరువు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండకు దిగువన తెప్పోత్సవంగా అభివృద్ధి చేస్తున్న గండి చెరువు నిండింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైనుంచి వచ్చే నీరు చేరుతుండడంతో మంగళవారం గండి చెరువు పూర్తి స్థాయిలో నిండింది. నిండుకుండలా కనిపిస్తున్న గండి చెరువు చెంతకు భక్తులు, స్థానికులు చేరుకొని సందడి చేస్తున్నారు.



నిండుకుండలా కనిపిస్తున్న గండి చెరువు

ఒక్క చేరిక..
రెండు పార్టీల్లో కాక!

మారుతున్న భువనగిరి రాజకీయ ముఖచిత్రం

- అనిల్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై సీఎం భరోసా
- డీసీసీ రేసులో పలువురు నేతలు
- ఇంచార్జ్ పదవి కోసం ప్రయత్నాలు
- కాంగ్రెస్ వైపు చూస్తున్న ఇద్దరు సీనియర్ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం సీఎం కేసీఆర్‌తో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, యాదాద్రి : కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో భువనగిరి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఆయన రాజీనామాతో జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి, భువనగిరి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. భువనగిరిలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వర్గాలు తమ పట్టు కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. వచ్చే ఎన్నికల్లో టికెట్ల వేటలో పడ్డారు. బీజేపీలో ఉన్న జిట్టా బాలకృష్ణారెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ దారిలో మరికొందరు ఉన్నారు. ఇదిలా ఉండగా సోమవారం కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన చోటనే మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు పోటీ సమావేశం నిర్వహించారు. అనిల్‌రెడ్డి పోవడం వల్ల వచ్చేనష్టం లేదని, పార్టీ శ్రేణులకు తాము అండగా ఉంటామని చెప్పారు.

అనిల్‌కు ఎంపీ టికెట్?

బీఆర్ఎస్ పార్టీలో చేరిన అనిల్‌కుమార్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు తనదేనని సీఎం కేసీఆర్ చెప్పడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. శేఖర్‌రెడ్డి, అనిల్ రెడ్డి కలిసి పనిచేస్తే భువనగిరి జిల్లా ప్రగతికి బాగా దోహద పడుతుందని కేసీఆర్ చెప్పిన మాటలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. వారు ఏ రకంగా కలిసి పనిచేస్తారనేది హాట్‌టాపిక్ మారింది. ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డిల్లో రానున్న ఎన్నికల్లో ఎవరు ఎమ్మెల్యే, ఎవరు ఎంపీగా పోటీ చేస్తారన్నది చర్చ. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకు సీటు ఇస్తే మాత్రం అనిల్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ లేనట్లే. అయితే, అనిల్‌కు భువనగిరి ఎంపీ టికెట్ హామీ లభించిందన్న ప్రచారమూ సాగుతోంది. లేదంటే ఎమ్మెల్సీ అవకాశంపై పరిశీలిస్తున్నారన్న చర్చజరుగుతోంది.

డీసీసీ రేసులో ఎందరో..

అనిల్‌కుమార్‌రెడ్డి తర్వాత డీసీసీ అధ్యక్షుని రేసులో పలువురు పోటీపడుతున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరవర్గంతోపాటు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వర్గం సైతం పోటీలో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు ఆశావహులు ఇప్పటికే డీసీసీ పీఠంపై కన్నేశారు. అలాగే భువనగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పదవి ఎవరికి దక్కుతుందోననే చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్‌గా కొనసాగారు. ఇంచార్జ్‌గా కొనసాగిన వారికే దాదాపుగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాగా, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరికతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి క్యాడర్‌లో నిస్తేజం అవహించింది. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీల నుంచి పైళ్ళ శేఖర్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డిలు పోటీతో ఎన్నికల ఖర్చు కోట్లలో ఉండేది. మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే ఎన్నికల సమరంలో నాలుగు రాళ్లు సంపాదించుకోవచ్చని అంచనాలు వేసుకున్న పలువురి ఆశలు అడియాశలయ్యాయి. భారీగా డబ్బులు ఖర్చుపెట్టే ఇద్దరు ఒకే పార్టీలో చేరడంతో ఎవరు పోటీచేసినా.. ఒక్కరే ఖర్చు పెడతారన్నది నిజం. ఈ క్రమంలో తాము ఆశించినంత పొందలేమన్న నిర్వేదం క్యాడర్‌లో కనిపిస్తోంది.

కాంగ్రెస్ వైపు జిట్టా చూపు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జిట్టా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యూహరిస్తున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీని వీడడంతో పార్టీలో చేరే వారిలో జిట్టా ఒకరు ఉన్నారు. కాగా తనను కాంగ్రెస్‌లో చేరమని ఆ పార్టీ నాయకులు అడుగుతున్నారని, త్వరలో కార్యకర్తలతో సమావేశమైన నిర్ణయం చెబుతానని జిట్టా బాలకృష్ణారెడ్డి అంటున్నారు.

చింతల సైతం..

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. తనతో కాంగ్రెస్ నాయకులు మూడు నెలలుగా టచ్‌లో ఉన్నారని చెపుతున్న ఆయన.. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లుగా తనను పట్టించుకోవడం లేదనే ఆవేదనలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా వెంకటేశ్వర్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉన్నారు. భువనగిరి నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశమైన తర్వాత తాను సోనియాగాంధీ నాయకత్వంలో పార్టీలో చేరుతానన్నారు.

బీసీలకు రెండు.. ఎక్కడ?

- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇచ్చే యోచనలో కాంగ్రెస్
- భువనగిరి, ఆలేరు, జనగామలో ఆశావహుల పోటీ
- ఎక్కడ.. ఎవరికి ఇస్తారోనని పార్టీలో చర్చ



సాక్షి, యాదాద్రి : ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించలన్న ప్రతిపాదన.. భువనగిరి పార్లమెంట్ స్థానంలో కొత్త వివాదాలకు తెరలేపింది. తనకు టికెట్ రాదన్న సంకేతాలు అందడంతోనే డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారన్న ప్రచారం సాగుతోంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో తుంగతుర్తి, నకిరేకల్ రెండు రిజర్వుడు స్థానాలను మినహాయించి మిగిలిన ఐదు స్థానాల్లోంచి ఎక్కడ బీసీలకు టికెట్లు సర్దుబాటు చేస్తారనేది ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నడుస్తున్న చర్చ. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, జనగామ, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌లలో తుంగతుర్తి, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు కాగా, మిగిలిన ఐదు నియోజకవర్గాలు జనరల్ స్థానాలు. అన్ని చోట్ల ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

రెండింట్లోనే బీసీలకు..

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఐదు జనరల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో బీసీ అభ్యర్థులకు టికెట్‌లు ఇచ్చే అవకాశం ఉన్న స్థానాలు మూడింటిపైనే తీవ్ర చర్చ నడుస్తోంది. రెండు సీట్లు బీసీలకు కేటాయించాలన్న పార్టీ నిర్ణయం ప్రకారం జనగామ, భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు చోట్ల బీసీలకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉందన్న చర్చజరుగుతోంది. అంతా ఐక్యంగా ఉన్నట్లు కనబడుతున్నా.. అంతర్గతంగా గ్రూపు రాజకీయాల నేపథ్యంలో టికెట్లు కేటాయింపు అంత సులభం కాదని తెలుస్తోంది. జనగామ అసెంబ్లీ టికెట్‌ను మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆశిస్తున్నారు. 2014లో జనగామలో పొన్నాల లక్ష్మయ్య కోడలు వైశాలి పోటీచేశారు. 2018లో పొన్నాల పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి పొన్నాలకు చెక్ పెట్టేందుకు పార్టీలో అంతర్గతంగా పావులు కదుపుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఆలేరులో ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నగేష్, బండ్రు శోభారాణి కూడా టికెట్ ఆశిస్తున్నారు. భువనగిరిలో బీసీలకు టికెట్ కావాలని బీబీనగర్ మాజీ సర్పంచ్ పంజాల రామాంజనేయులుగౌడ్ తోపాటు మరికొందరు ఆశావహులు రంగంలోకి వస్తున్నారు. అయితే మిగిలిన మునుగోడు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో కూడా ఓసీలతో సమానంగా బీసీలకు అవకాశం ఉన్నా.. పరిస్థితులు ఎవరికి అనుకూలంగా ఉంటాయో చూడాల్సిందేనని పరిశీలకులు అంటున్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం

- కలెక్టర్ పమేలా సత్పతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

భువనగిరిటౌన్: ఈవీఎం ఓటింగ్‌పై ఇప్పటికే బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమాలతో పాటు, ప్రజలకు వివరిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి వికాస్ రాజ్ మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఫారం 6, 7, 8 ల ద్వారా వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి అమరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి నాగిరెడ్డి, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ శ్యాంసుందర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సురేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రిపరేషన్‌లో భాగంగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల బాధలు సీఎం కేసీఆర్‌కు తెలుసు



మాట్లాడుతున్న టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్

- త్వరలోనే సీపీఎస్, ఈహెచ్ఎస్, పీఆర్‌సీపై ప్రకటన
- టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్

నల్లగొండ టౌన్ : ఉద్యమ నాయకుడిగా ఉద్యోగుల బాధలు, సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీఓ) రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ అన్నారు. మంగళవారం నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా టీఎన్‌జీఓ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులకు జీతాలు ఉన్నాయని, నాలుగో తరగతి ఉద్యోగులు కూడా ఆదాయపన్ను చెల్లిస్తున్నారంటే మన స్థాయిని కేసీఆర్ ఏ స్థాయికి తీసుకుపోయారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొన్ని శక్తులు కావాలని మనలో చీలికలు తేవడానికి కుట్ర పన్నుతున్నారని వారి మాటలు వింటే మన పనులు ఎప్పటికీ జరగవన్నారు. త్వరలో ఉద్యోగుల సీపీఎస్, హెల్త్ ఇన్సూరెన్స్, పీఆర్‌సీ సీలింగ్‌పై శుభవార్తను వినబోతామని చెప్పారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో ఉద్యోగుల నివేదన సభను నిర్వహించి ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేస్తామన్నారు. టీఎన్‌జీఓ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జానిమియా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, జె.శేఖర్‌రెడ్డి, దయాకర్‌రావు, అకునూరి లక్ష్మయ్య, వి.భాస్కర్, మాధవి, రమ్యసుధ, జయరావు, దుర్గా, జాఫర్, కమల పాల్గొన్నారు.

ఒక్కరు వీడితే పార్టీకి నష్టమేమీ లేదు



ఐక్యతను చాటుతున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరిటౌన్: కాంగ్రెస్ పార్టీని ఒక్కరు వీడినంత మాత్రన పార్టీకి ఎలాంటి నష్టం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బీర్ల ఐలయ్య, రామాంజనేయులు అన్నారు. మంగళవారం భువనగిరిలోని వివేరా హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై కుంభం అనిల్‌కుమార్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. ఆయన డీసీసీ అధ్యక్షుడిగా పార్టీలో ఏనాడు మనస్ఫూర్తిగా పని చేయలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ అయోమయానికి గురికావాల్సిన అవసరం లేదని, రానున్న ఎన్నికల్లో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మణిపూర్ ఘటనలో మృతులకు సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, వలిగొండ జెడ్పీటీసీ వాకిటి పద్మా అనంతరెడ్డి, పాశం సత్తిరెడ్డి, సుర్కంటి సత్తిరెడ్డి, నాయకులు అండెం సంజీవరెడ్డి, పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, యుగంధర్‌రెడ్డి, ఎల్లంల సంజీవరెడ్డి, దర్గాయి హరి ప్రసాద్, ప్రదీప్, బబ్లూ, చీర్ల శ్రీశైలం, ఎండీ నజీర్, రఫియోద్దీన్, చల్లగురుగుల రఘుబాబు, దేవరకొండ నరసింహాచారి, మందడి రామకృష్ణారెడ్డి, గోదా శ్రీనివాస్, మచ్చ నరసింహ, చిన్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి సహకారమందిస్తా

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి మారుతీదేవి సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో సర్వే నంబర్ 50లో కోర్టుకు కేటాయించిన స్థలాన్ని న్యాయమూర్తి మహతి వైష్ణవితో కలిసి పరిశీలించారు. భూ కేటాయింపు, హద్దుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సహకారం అందిస్తానన్నారు. ఆమె వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ న్యాయమూర్తి

అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో కలెక్టర్, డీసీపీ తదితరులు

సాక్షి,యాదాద్రి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ 2022- 23 సంవత్సరానికి 95 శాతం కేసుల్లో పరిహారం కింద రూ.90లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, కమిటీ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారమందిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని తెలిపారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ సంభ్యుల విజ్ఞప్తి మేరకు ఈ కేసుల్లో ఫిర్యాదుదారులకు చార్జ్‌షీట్ కాపీ ఇవ్వబడుతుందని తెలిపారు. పౌర హక్కుల ప్రచార కార్యక్రమంలో పోలీసు శాఖ కూడా పాల్గొంటుందని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు మొగులయ్య, వెంకటరెడ్డి, శివరామిరెడ్డి, మానిటరింగ్ కమిటీ సభ్యులు సుర్వంగా శివలింగం, బర్రె సుదర్శన్, కంచనపల్లి నర్సింగరావు, దాసరి తిరుమలేష్, రాజన్ నాయక్, భాస్కర్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, అధికారులు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- నీరు ఎక్కువై కుళ్లిపోతున్న పత్తి మొక్కలు



సికిందర్‌నగర్‌లో కుళ్లిపోతున్న పత్తి మొక్కలు

మోటకొండూర్, ఆత్మకూరు(ఎం), తుర్కపల్లి: గత వారం పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నల్లరేగడి భూమిలో పత్తిని విస్తారంగా సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తెలో విత్తనాలు నాటి వర్షానికై ఎదురు చేసిన రైతులు ప్రస్తుతం వర్షాలు తెరిపివ్వాలని వరుణుడిని వేడుకుంటున్నారు. విత్తనాలు, దున్నకాలపై ఈ ఏడాది పెట్టుబడి ఖర్చు పెరిగాయి. ప్రస్తుతం వర్షాలతో మొక్కలకు నీరు ఎక్కువై కుళ్లిపోతున్నాయి. దీంతో ఏం చేయాలలో అర్థంకాక పత్తి రైతులు తలలు పట్టుకుంటున్నారు. అదేవిధంగా ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బిక్కేరు వాగు సమీప గ్రామాల ప్రజల రాకపోకలు నిలిపివేశారు. వాగు వద్ద రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తుర్కపల్లి మండలంలోని చిన్నలక్ష్మాపూర్ శివారులో ఉన్న సముద్రం చెరువు రెండు రోజులుగా అలుగు పోస్తోంది.



మోటకొండూరు: సికిందర్‌నగర్‌లోని పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు



ఆత్మకూరు(ఎం): పత్తి చేనులో చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం... కాపర్‌వైరు చోరీ



చల్లూరులో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

రాజాపేట : గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును చోరీ చేశారు. ఈ ఘటన రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలోని నాయినోను బావి సమీపంలో వెలుగుచూసింది. మంగళవారం గ్రేటర్ ఇన్‌ఫ్రా వెంచర్ వాచ్‌మన్ వర్కర్ అయిలయ్య దీనిని గుర్తించి పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

వలిగొండ : గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు నుంచి గుర్తుతెలియని యువకుడు రైల్వేట్రాక్‌పై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

యాదాద్రిలో మహారాష్ట్ర సర్పంచ్‌ల పూజలు



యాదాద్రి కొండపైన ముల్దానా నియోజకవర్గ సర్పంచ్‌లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని మహారాష్ట్రలోని ముల్దానా నియోజకవర్గానికి చెందిన 70మంది సర్పంచ్‌లు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. సర్పంచ్‌లకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న ముల్దానా సర్పంచ్‌లకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ప్రధానాలయ పునః నిర్మాణ విశేషాలను ప్రభుత్వ విప్ గొంగిడి సునిత వారికి వివరించారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు యాదాద్రీశుడి ఆలయాన్ని సందర్శించినట్లు ముల్దానా నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు పేర్కొన్నారు.

వాటర్‌ట్యాంకు తండా శోకసంద్రం

- అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ ఆత్మహత్య
- స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు
- మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు



వ్యవసాయ క్షేత్రంలో కార్తీక్ మృతదేహాన్ని ఖననం చేస్తున్న బంధువులు

మిర్యాలగూడ టౌన్ : అనుమానాలే నిజమయ్యాయి. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చి ఐఐటీ విద్యార్థి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో ఈ నెల 17న అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ బంగాళాఖాతంతో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలియడంతో మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకు తండా శోకసంద్రంగా మారింది. విశాఖపట్టణం నుంచి అతడి మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకురావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహం బాగా కుళ్లిపోవడంతో కొన్ని నిమిషాలే ఇంటి వద్ద ఉంచి అనంతరం వారి వ్యవసాయ పొలంలోనే అశ్రునయనాలతో ఖననం చేశారు.

మృతుడి కుటుంబానికి పలువురి పరామర్శ

ఐఐటీ విద్యార్థి కార్తీక్ చనిపోవడంతో అతడి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు తనయుడు ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్తీక్ అంత్యక్రియలు పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఉన్నారు. అతడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ నాయక్, సీపీఎం నాయకులు డబ్బీకార్ మల్లేష్, రవినాయక్, భద్యానాయక్, వెంకన్ననాయక్, గోపి, మక్లా, సత్యనారాయణ, సర్పంచ్ రాంచందర్ నాయక్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, శంకర్ తదితరులున్నారు.

అన్నను చూడాలని ఉంది..

కార్తీక్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో వాటర్ ట్యాంకు తండాలోని ఇంటి వద్దకు తీసుకురాగానే అతడి చెల్లి సాత్విక అన్నను చూడాలని ఉంది.. చూపించండి అంటూ రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. మృతదేహం ప్యాక్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులు చివరి చూపు చూడలేకపోయారు. మనుమడు అదృశ్యం అయినప్పటి నుంచి నాయనమ్మ అన్నం, నీళ్లు ముట్టకపోవడంతో సొమ్మసిల్లింది. తాత వాలు అయ్యా ఒక్క ముద్ద తిందువు రా అంటూ అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.



కంటతడి పెట్టుకుంటున్న కార్తీక్ చెల్లెలు సాత్విక

కొడుకా..కొడుకా..

కార్తీక్ మృతదేహాన్ని ఖననం చేసేందుకు వారి వ్యవసాయ పొలం వద్దకు తరలిస్తుంటే తల్లి సైదమ్మ తల్లడిల్లిపోయింది. కొడుకా.. కొడుకా అంటూ అంబులెన్స్ వెంట పరుగెడుతుంటే చూసిన వారందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'నే నేమిజేస్తిని దేవుడా కడుపు కోత మిగిల్చావు' అంటూ గుండెలవిసేలా రోదించింది.



సొమ్మసిల్లిన కార్తీక్ నాయనమ్మ ధర్మి



కార్తీక్ తండ్రి ఉమ్లానాయక్‌ను ఓదారుస్తున్న ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థ



కార్తీక్ ఇంటి వద్ద గుమిగూడిన తండావాసులు, బంధువులు

కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వలేదని..



కూలీలతో ఇనుపచువ్వలు చుట్టిస్తున్న కాంట్రాక్టర్



బయట పడవేసిన ఇనుప చువ్వలు

- 'మన ఊరు–మన బడి' పనులు అడ్డుకున్న ప్రధానోపాధ్యాయురాలు
- న్యాయం చేయాలని డీఈఓ, పోలీసులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు

చివ్వెంల(సూర్యాపేట) : కాంట్రాక్టర్ తనకు డబ్బులు ఇవ్వలేదని మన ఊరు–మనబడి పనులను ఓ ప్రాధానోపాధ్యాయురాలు అడ్డుకుంది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. కాంట్రాక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదు నెలల క్రితం టెండర్ ద్వారా పాఠశాలలో మన ఊరు–మన బడి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్ నాగు నాయక్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. పాఠశాలలో డైనింగ్ హాల్, నీటి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో పనులు చేపడుతుండగా సబంధిత పాఠశాల హెచ్‌ఎం రమణ తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు కాంట్రాక్టర్ ఆరోపించాడు. దీంతో తన వద్ద లేవని తానే ఇబ్బందుల్లో ఉన్నానని తెలిపానని పేర్కొన్నాడు. అయినా అడుగుతుండటంతో నెల రోజుల క్రితం జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. సోమవారం మధ్యాహ్న సమయంలో పాఠశాలలో పనులు చేస్తుండగా వర్షం కురవడంతో ఇంటికి వెళ్లానని, వచ్చి చూసే సరికి ఐరన్ చువ్వలు బయట వేసి గుంతలు పూడ్చివేశారని ఆవేదనవ్యక్తం చేశాడు. పాఠశాల విద్యార్థులను అడుగగా హెచ్‌ఎం తొలగించమంటే తామే తొలగించామని చెప్పారన్నారు. దీంతో హెచ్‌ఎంను అడుగగా ఇక్కడ వద్దు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నారని వాపోయాడు. దీంతో జిల్లా విద్యాధికారితో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ తెలిపాడు. ఈ విషయమై హెచ్‌ఎం రమణను వివరణ కోరగా తాను ఐరన్ చువ్వలు తొలగించలేదని, ఎవరు తొలగించారో తనకు తెలియదన్నారు. కాంట్రాక్టర్‌ను డబ్బులు అడిగానని వస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

భువనగిరి : పోయిన సెల్‌ఫోన్లను పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. ఈ నెల 2వ తేదీన రాగాల శ్రీనివాస్ తన సెల్ ఫోన్ భువనగిరి బస్టాండ్‌లో పోయిందని ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మొబైల్ ఐఎంఈఐ ఆధారంగా ఈ నెల 24న సెల్ ఫోన్‌ను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు. ఈ నెలలోనే పోగొట్టుకున్న మరో రెండు సెల్ ఫోన్లను కూడా బాధితులకు అప్పగించినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



సరిత (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వివాహిత అదృశ్యమైంది. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామానికి చెందిన మద్దెల నాగరాజు భార్య మద్దెల సరిత ఈ నెల 23న సూర్యాపేటలోని మాంటిస్సోరి స్కూల్‌లో చదువుతున్న పిల్లలను చూసేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో నాగరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన మహిళకు 2010లో నాగరాజుతో వివాహం జరగ్గా.. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ : కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో ప్రసూతి సెలవులు కల్పించాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి దార వెంకన్న, పగిడిపాటి ప్రవీణ్, భిక్షమాచారి, ఎండి హమీను ద్దీన్, చాడోజు శ్రీధర్, కొంపెల్లి రమేష్, రాజు, శ్రీను, సతీష్, రవీందర్, భాగ్యలక్ష్మీ, మంజుల, సంధ్యరాణి, మాధవి, రాధ, నాగమణి పాల్గొన్నారు.

కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన బైక్

- ఒకరికి గాయాలు

చౌటుప్పల్: రోడ్డుపై అకస్మాత్తుగా బ్రేక్ వేసిన కంటెయినర్‌ను వెనుక నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి రోడ్డులోని చెరుకుబావి కాలనీకి చెందిన రేకల వెంకటేష్(37) సోమవారం రాత్రి బైక్‌పై వలిగొండ రోడ్డు నుంచి జాతీయ రహదారి మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట కంటెయినర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్‌తో కంటెయినర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

శిశు గృహంలో ఏడాది బాలుడి అప్పగింత



బాలుడిని బాలల పరిరక్షణ, సఖి కేంద్రం అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పోలీసులు ఓ వృద్ధురాలి వద్ద ఉన్న ఏడాది వయసున్న బాలుడిని స్వాధీనం చేసుకుని శిశు గృహలో బాలల పరిరక్షణ అధికారులకు అప్పగించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, స్థానికులు తెలిపి వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం మానసిక పరిస్థితి సరిగా లేని ఓ వృద్ధురాలి వద్ద సుమారు ఏడాది వయసు గల బాలుడు ఉన్నాడు. ఆ బాలుడు ఏడుస్తుంటే.. వృద్ధురాలు అటు, ఇటుగా తిరుగుతుంది. గమనించిన స్థానికులు ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆరా తీశారు. బాలుడు తల్లి ఎక్కడ ఉంది. బాలుడు ఏడుస్తుంటే అటు, ఇటు ఎందుకు తిరుగుతున్నావ్ అంటూ ప్రశ్నించారు. దీనికి వృద్ధురాలి వద్ద సరైన సమాధానం రాకపోవడంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బస్టాండ్ సమీపంలోకి వెంటనే పోలీసులు చేరుకొని వృద్ధురాలిని విచారించారు. మానసిక పరిస్థితి సరిగా లేని వృద్ధురాలి సమాధానాలు సరిగా లేకపోవడంతో ఎవరు ఆ బిడ్డ, ఎక్కడి నుంచి తీసుకువచ్చిందా లేక.. ఎవరైన ఇచ్చి వెళ్లారా అనే అనుమానం వచ్చిన పోలీసులు.. ఆ బాలుడిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, సఖి సిబ్బందికి అప్పగించారు. ఈ ఘటనపై సీఐ రమేష్‌ను వివరణ కోరగా.. ఏడాది బాలుడు, వృద్ధురాలు సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టకు చెందిన ఓ కుటుంబం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఓ కార్యక్రమానికి వచ్చి వెళ్తున్న సమయంలో తప్పి పోయారని తెలిపారు. మానసిక పరిస్థితి బాగాలేని వృద్ధురాలు చెప్పిన సమాధానాలతో మాసాయిపేట, అడ్డగుట్టలో విచారణ చేయగా.. తమ బాలుడే అని కుటుంబ సభ్యులు చెప్పారని సీఐ తెలిపారు. కానీ బాలుడిని ఉదయం తీసుకెళ్తామని ఆ కుటుంబ సభ్యులు చెప్పారని సీఐ పేర్కొన్నారు.

'మైహోం'లో ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కోదాడ డీఎస్పీ

- శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షించాలని కార్మికుల వినతి

హుజూర్‌నగర్: మేళ్లచెరువు పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన స్థలాన్ని మంగళవారం కోదాడ డీఎస్పీ ప్రకాష్ పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన స్థలంలో పడిపోయిన శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షించాలని విన్నవించుకున్నారు. ఇప్పటికే శిథిలాల కింద పరిశీలించామని, ఎవరూ లేరని నిర్ధారించుకున్నామని డీఎస్పీ తెలిపారు. జేసీబీ తెప్పించి శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షిస్తామని, ఎవరూ భయపడవద్దని వారికి హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శాంతించారు.



శిథిలాల వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రకాష్

లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నల్లగొండ క్రైం, రామగిరి(నల్లగొండ): దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయమూర్తి బి.తిరుపతి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..పుట్టుకతో మానసిక దివ్యాంగురాలైన(30) మహిళ నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశా వెనుక గల శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటోంది.ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమెపై పక్క ఇంట్లో ఉంటున్న చిందాల సుధీర్‌కుమార్ అలియాస్ బాబురావు కన్నుపడింది. ఓ రోజు ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో మాయ మాటలు చెప్పి దివ్యాంగురాలైన మహిళను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో సుధీర్‌కుమార్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ హేళన చేశాడు. దీంతో బాధితులు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2021 డిసెంబర్ 31న ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐలు బాలగోపాల్, గోపి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకట్‌రమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి సెక్షన్ 376 (ఎల్) ప్రకారం పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

మూసీలో వ్యక్తి మృతదేహం లభ్యం



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు పరిధిలో గల మూసీలో మంగళవారం 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదారు రోజులుగా మూసీ వరదతో పాటు భారీగా డెక్కాకు కొట్టుకొని వచ్చి జూలూరు–రుద్రవెల్లి గ్రామాల మధ్య ఉన్న మూసీ లోలెవల్‌బ్రిడ్జి వద్ద చేరింది. బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపుడెక్కాకు తొలగించేందుకు మంగళవారం మధ్యాహ్నం అధికారులు జేసీబీ సహాయంతో పనులకు ఉపక్రమించారు. ఈ క్రమంలో గుర్రపుడెక్కాకులో చిక్కుకొన్న వ్యక్తి మృతదేహం కన్పించింది. దాంతో డ్రైవర్ అక్కడే బందోబస్తులో ఉన్న పోలీస్‌కానిస్టేబుల్‌కు విషయం చెప్పాడు. అనంతరం జేసీబీ సహాయంతో ఆ మృతదేహాన్ని మూసీలో నుంచి బయటికి తీశారు. అయితే మృతదేహం కుళ్లినస్థితిలో ఉండటంతో సంఘటన స్థలంలోనే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బెంగళూరుకు చెందిన వ్యక్తిగా గుర్తింపు..

షర్ట్, బనియన్ లేకుండా కేవలం నల్ల ప్యాంటు ధరించి నడుముకు మొలదారం కట్టి ఉండటంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకక మొదట పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా భావించారు. పోస్టుమార్టం చేసే ముందు ప్యాంటును తొలగించగా లోపలి జేబులో ఆ వ్యక్తికి సంబంధించి ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు లభ్యమయ్యాయి. గఆధార్‌కార్డు ద్వారా అతని పేరు మున్నంగి శ్రీనివాస్‌రెడ్డి, ఫ్లాట్‌నంబర్ సీ1, వినాయక మెడోస్, చిక్క బన్వాడి, కల్యాణ్‌నగర్, బెంగళూరు అడ్రస్ ఉంది. అలాగే జేబులో దొరికిన ఫోన్‌నంబర్ ఆధారంగా పోలీసులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అయితే శ్రీనివాస్‌రెడ్డి ప్రమాదవశాత్తు మూసీలో జారిపడ్డాడా లేదా, ఆత్మహత్య చేసుకొన్నాడా అనేది తెలియాల్సి ఉంది. మృతదేహం కుళ్లి చర్మం ఊడే పోయే స్థితిలో ఉండటంతో ఇతను నాలుగైదు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



మృతుడి జేబులో దొరికిన పాన్‌కార్డు

యాదాద్రి జిల్లాలో లంకె బిందెలు లభ్యం?



అధికారులు స్వాధీనం చేసుకొన్న ఖాళీ బిందెలు ఇవే

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద మట్టి తవ్వుతుండగా నాలుగు లంకెబిందెలు దొరికినట్లు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన పది రోజుల క్రితం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి మంగళవారం సంఘటన స్థలాన్ని సందర్శించి గ్రామంలో విచారించారు. బాధ్యులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి పంచనామా నిర్వహించారు. దొరికిన బిందెలను స్వాధీనం చేసుకున్నారు. పురావస్తు శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగిస్తామని తహసీల్దార్ వీరాభాయి తెలిపారు.

ఖాళీబిందెలా.. లంకె బిందెలా..!

10 రోజుల క్రితం గ్రామానికి చెందిన రైతు కొలను బాల్‌రెడ్డి గ్రామ సమీపంలోని తుమ్మల చెరువు సమీపంలో ఉన్న పట్టాభూమిలో జేసీబీతో మట్టిని తవ్విస్తున్నాడు. ఈ క్రమంలో మట్టితో పాటు 4 బిందెలు బయటపడ్డాయి. జేసీబీ డ్రైవర్ పర్వతం నవీన్‌తో పాటు అక్కడే ఉన్న మక్త అనంతారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు సురేశ్, ధన్‌రాజ్‌లు చూశారు. నవీన్ ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు, మీకు మద్యం తాగడానికి డబ్బులు ఇస్తానని చెప్పి పంపించాడు. అనంతరం నవీన్ ఆ బిందెలను ఇంటికి తీసుకెళ్లాడు. డబ్బుల విషయమై నవీన్‌కు ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో వారు నాలుగు రోజుల తరువాత గ్రామంలో బిందెలు దొరికిన విషయం తెలిసినవారికి చెప్పారు. ఈ విషయం కాస్తా ఆ నోట, ఈ నోట బయటకు పొక్కడంతో వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వైరల్ చేశారు. ఈ విషయం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే బాధితుడిని ప్రశ్నించగా ఖాళీబిందెలు మాత్రమే దొరకాయని అందులో ఏమీలేవని చెబుతున్నాడు. ఏమీలేక పోతే బిందెలు దొరికిన వెంటనే గ్రామస్తులకు , అధికారులకు గానీ చెప్పకుండా ఎందుకు గోప్యంగా ఉంచారనేది పలు అనుమానాలకు తావిస్తోంది. దొరికినవి ఖాళీ బిందెలా, లంకె బిందెలా అనేది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

వేర్వేరు చోట్ల వర్షానికి కూలిన ఇళ్లు



బొమ్మలరామారం : కూలిన ఇంటి వద్ద మల్లమ్మ



మునుగోడు : కొరటికల్‌లో గోడ కూలడంతో ధ్వంసమైన వంట సామగ్రి

బొమ్మలరామారం : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షం కారణంగా గ్రామాల్లోని పాత గృహాలు పూర్తిగా నాని కూలిపోతున్నాయి. బొమ్మలరామారం, మునుగోడు, మోత్కూరు, గట్టుప్పల్ మండలాల పరిధిలో మంగళవారం పలు ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్‌లో మోటే మల్లమ్మ, రామలింగంపల్లి గ్రామంలోని ఊదరి యాదగిరిల ఇళ్లు కూలిపోయాయి. తహసీల్దారు పద్మ సుందరి ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలాలను పరిశీలించారు. కూలిపోయిన ఇళ్లను పరిశీలించి జరిగిన నష్టం విలువను అంచన వేశామని తహసీల్దారు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. నిరాశ్రయులైన బాధితులకు ఆదుకోవాలని సర్పంచ్‌లు సంగిశెట్టి వెంకటేష్, యాంజాల కళ ప్రభుత్వాన్ని కోరారు.

కొరటికల్‌లో కూలిన ఇంటి గోడ

మునుగోడు: వారం రోజులుగా కురుస్తున్న మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో కాశిమల్ల లింగయ్య ఇంటి గోడ కూలింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అతని కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కోరుతున్నారు.


మోత్కూరులో..

మోత్కూరు : ఇటీవల కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ కేంద్రంలోని ఓ ఇల్లు మంగళవారం సాయంత్రం కూలింది. మున్సిపల్ కేంద్రంలోని గడి బజార్‌లో ఉన్న చిలుకమర్రి రాములుకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు నాని కూలిపోయింది.

గట్టుప్పల్‌లో..

చండూరు(గట్టుప్పల్) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మొద్దు తిరుపతయ్యకు చెందిన పూరి గుడిసె గోడ మంగళవారం రాత్రి కూలింది. తిరుపతయ్య కుటుంబం రోజు వారీ కూలీలుగా పని చేస్తుంటారు. తమను ఆదుకోవాలని అధికారులను తిరుపతయ్య కోరాడు.

మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

బీబీనగర్: మండలంలోని జియపల్లి గ్రామంలో మహిళా సంఘాలకు కేటాయించిన భూమిలో చేపట్టిన అక్రమ తవ్వకాలను మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియపల్లి గ్రామంలో ప్రభుత్వ సర్వే నంబర్ 207లో 14 ఎకరాలు ఉండగా అందులో మహిళా సంఘం వారికి పాల కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారని, కానీ అందులో కొందరు అక్రమంగా మట్టి తవ్వి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు కూడా ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సురకంటి జంగారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఆముదాల రాజేందర్, జమీలపేట అధ్యక్షుడు దర్శన్, ఓబీసీ జిల్లా నాయకులు నాశబోయిన సాయి, బొర్రా వెంకటేష్, సందీప్, అనిల్, కృష్ణ, దయాకర్, శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు వరిగంటి మమత సునంద, సంతోష, సుమలత, రమాదేవి, కవిత, మైబీ, లక్ష్మి, శమీమ్, సంతోష, పద్మిని, అన్నపూర్ణ, మానస, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.